క్లుప్తంగా

సిటీ పోలీస్ జట్టుకు సీపీ అభినందన



విజేతలను అభినందిస్తున్న సీపీ శ్రీకాంత్

మల్కాపురం: విశాఖపట్నం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన లీగ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన సిటీ పోలీస్ జట్టును పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ అభినందించారు. జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన మల్కాపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వి.త్రినాథ్‌ను ప్రశంసించారు.

కరాటే పోటీల బ్రోచర్ విడుదల



కరాటే పోటీల బ్రోచర్ విడుదల చేస్తున్న మజ్జి సోమేష్,షేక్‌శ్రీను, ప్రకాష్

మల్కాపురం: వచ్చే నెల 26వ తేదీన నగరంలో జరగనున్న ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మజ్జి సోమేష్, ప్రముఖ సినీ ఆర్టిస్ట్ షేక్ శ్రీను విడుదల చేశారు. మల్కాపురంలోని సోమేష్ నివాసం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వచ్చే నెల 26న జరగబోవు కరాటే పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బాక్సర్ పిల్లా సాయి, బోదిధర్మ సన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ కోచ్ ప్రకాష్,శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



రేకుల షెడ్డును తొలగిస్తున్న రైల్వే అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రోడ్డులోని విజయనగర్ కాలనీలో రైల్వే స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును రైల్వే అధికారులు తొలగించారు. గతంలో ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించగా తొలగించినట్లుగా అధికారులు చెబుతున్నారు. నిర్మాణ సమయంలో సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ హెచ్చరించినా నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణ విషయం రైల్వే అధికారుల దృష్టికి రావడంతో తొలగింపు చేపట్టారు. ఏఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో తొలగింపులు జరిగాయి. మరో మారు నిర్మాణం చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

కాల్వల్లో పూడిక తీత



పూడికల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు శ్రీనివాసనగర్‌లో కాల్వల్లో పూడికల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. మురుగు నీరు రోడ్డు పైకి వస్తోందని స్థానికులు కార్పొరేటర్ బొమ్మిడి రమణకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి పూడిక తీత పనులను దగ్గరుండి చేయించారు. ఆయనతో పాటు సచివాలయ కార్యదర్శి రామకృష్ణ, శానిటరీ సిబ్బంది ఆంటోని పాల్గొన్నారు.

ప్యానళ్లకు గుర్తుల కేటాయింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మూడు ప్యానళ్లకు గుర్తులు కేటాయించారు. ఒకటో ప్యానల్‌కు పుస్తకం, రెండో ప్యానల్‌కు రింగ్, మూడో ప్యానల్‌కు దువ్వెన గుర్తు కేటాయించినట్లు స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రిటర్నింగ్ ఆఫీసర్ జె.వి.రావు తెలిపారు. నాన్ వర్క్స్ ఉద్యోగులకు ఎల్ అండ్ డీసీ విభాగంలో, వర్క్స్ డివిజన్ ఉద్యోగులకు క్యూఏటీడీ విభాగంలో పోలింగ్ నిర్వహిస్తామని తెలియజేశారు.

అర్హుల చెంతకే సంక్షేమ ఫలాలు

పలు వార్డుల్లో కొత్త పింఛన్ల పంపిణీ



60వ వార్డులో కొత్త పింఛన్ అందిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్



58వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్న కార్పొరేటర్ లావణ్య



లబ్ధిదారుడికి పింఛను అందిస్తున్న బెహరా భాస్కరరావు



90వ వార్డులో పింఛను అందిస్తున్న చుక్క ప్రసాదరెడ్డి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో కొత్త పింఛన్ల పంపిణీ మంగళవారం పండగ వాతావరణంలో సాగింది. జీవీఎంసీ 60వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ పాల్గొని వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన 180 మందికి పింఛన్లు పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న గొప్పనేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగిలే పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల తలుపు తట్టి పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్ పార్టీలు, కుల మతాలు చూడకుండా కార్యక్రమాలు చేపట్టి పేదల పక్షపాతిగా నిలుస్తుందన్నారు. ప్రజలు తప్పుడు ప్రచారం పట్టించుకోకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని సురేష్ కోరారు.

➡ జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య కొత్తపింఛన్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

గోపాలపట్నం: జోన్–8 పరిధిలో పలు వార్డుల్లో ఇటీవల మంజూరైన కొత్త పింఛన్లను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. కుమారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 91, 92వ వార్డుల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందించారు. అలాగే 90వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి నగదు అందించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ, నమ్మి శ్రీను, యల్లపు వెంకటేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల అనర్హులకు చెక్కుల అందజేత

గతంలో టిడ్కో ఇళ్లకు కట్టిన డీడీల సొమ్మును అనర్హులైన వారికి జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందించారు. రెండు వార్డుల్లో 135 మందికి చెక్కులు అందించారు. డీడీలు కట్టిన వారికి తిరిగి డబ్బులు ఇప్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రికి మనం అండగా నిలవాలని కోరారు.

వెంకన్నగా దర్శనమిచ్చిన అప్పన్న



వేంకటేశ్వరస్వామి అలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న సిబ్బంది, అర్చకులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి మంగళవారం వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెంకన్నగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠింపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

పార్కుల అభివృద్ధికి కృషి

• డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



పాత కరాసా పార్క్‌లో చిన్నారుల క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న జియ్యాని

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. ఈమేరకు ఆయన మంగళవారం జీవీఎంసీ హార్టీ కల్చర్ ఇంజినీరింగ్ అధికారులతో పర్యటించారు. పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పర్యటించామని తెలిపారు. వాకింగ్ ట్రాక్‌లు, విద్యుత్ సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. ఇంత వరకు పలు పార్కుల్లో జిమ్ సామగ్రి, చిల్డ్రన్ ఆట వస్తువులు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పార్కుల్ని ఇపుడు బాగు చేస్తున్నామని తెలిపారు. కొంత మేర అభివృద్ధి జరిగినా కొన్ని పార్కుల్లో స్థానికులు వాకింగ్ చేసుకునేందుకు, పిల్లల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. శాంతినగర్ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, పార్క్ పేరు స్టీల్ లెటరింగ్‌లో బోర్డు ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించామన్నారు. అలాగే కరాసా పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఐరన్ గ్రిల్స్, షటిల్ గ్రౌండ్, మర్రిపాలెం ఉడాలేఅవుట్‌లోని గ్రీన్ బెల్టు వాకింగ్ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ మరమ్మతు, జిమ్,, చిల్డ్రన్ ఆట వస్తువులు, సుదరీకరణ పనులతో పాటు ఇదే కాలనీలోని చిన్న పార్క్‌లో సుందరీకరణ పనులకు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అయితే ఈ పార్కులను పాడు చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానికులపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు వెదుళ్ల శ్రీనివాసరావు, స్థానికులు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ సావిత్రి బాయి పూలే

• స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయురాలు
• కొనియాడిన వక్తలు
• జయంతి వేళ ఘన నివాళులు



సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ



సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి, అనసూయాదేవి



త్రినాథపురం పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న అప్పారావు

మల్కాపురం: దేశంలో మహిళా విద్యను ప్రోత్సహించిన గొప్ప మహిళ సావిత్రి బాయి పూలే అని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయిని అయిన ఆమె, మహిళల అక్షరాస్యత కోసం ఎంతో కృషి చేశారన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. 58వ వార్డు శ్రీహరిపురం వద్ద గల జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం సావిత్రిబాయి సేవల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త పెద్దిరెడ్ల నానాజీ, ఉపాధ్యాయుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

➡ మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల వద్ద జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, కళాశాల ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొని, సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి జీవిత అంశాలపై జరిగిన వ్యాస రచన పోటీలను నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలను బహూకరించారు.

62వ వార్డులో..

సింధియా: సావిత్రిబాయి జయంతిని 62వ వార్డు పరిధి త్రినాథపురంలోని జీవీఎంసీ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకుడు పెదిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమణికుమారి, స్థానిక నాయకులు భీశెట్టి గణేష్, రామకృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళిత సేన నివాళి

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. కంచరపాలెం పరిధి ఊర్వశీకూడలి దళిత సేన కార్యాలయంలో మంగళవారం దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ కుల వివక్షత రూపుమాపడంలో సావిత్రీభాయ్ దంపతులు పోరాటం అజరామమన్నారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చ కామేశ్వరరావు, పట్నాల ఝాన్సీరాణి, తాటిపూడి సీతారామ్, రాణి, జయకుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



అఖిల్ అలీషా(ఫైల్)

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. విమానాశ్రయం జంక్షన్ దాటి మొదటి వంతెన వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాత ఐటీఐ జంక్షన్ సమీపంలో నివాసముంటున్న మహమ్మద్ అఖిల్ అలీషా(73) గాజువాకలో పని ఉండడంతో స్కూటీపై వెళ్తున్నాడు. విమానాశ్రయం దాటిన తర్వాత జాతీయ రహదారిపై మొదటి వంతెన వద్దకు వచ్చే సరికి వెనుకనే వస్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలీషా కింద పడిపోగా.. ఆయన కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యాయి. తలకు కూడా గాయమవడంతో.. అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక మసీదులో ఆయన సేవలందిస్తున్నారు. కుమారుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీని స్వాధీనం చేసుకుని.. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లిలో మంగళవారం కారులో తరలిస్తున్న ఏడు కిలోల గంజాయితో పాటు ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, పెందుర్తి పోలీసులు కలిసి పట్టుకున్నారు. పెందుర్తి సీఐ అప్పారావు తెలిపిన వివరాలు.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన సారిపల్లి దుర్గాప్రసాద్ (28), విజయనగరానికి చెందిన తంగేటి భరత్ (30)కారులో ఎస్. కోట నుంచి విశాఖకు కారులో గంజాయి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్, పెందుర్తి పోలీసులు సరిపల్లి దగ్గర కారుని ఆపి తనిఖీ చేశారు. ఏడు కిలోల గంజాయితో పాటు కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా పట్టుబడిన ఇద్దరిపై పాత కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కరాటేలో ప్రతిభ చూపిన శ్రావణికి అభినందన



శ్రావణిని అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం వర్మ తదితరులు

సింహాచలం: ఇటీవల బంగ్లాదేశ్ రాజధాని డాకాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సదాశివుని శ్రావణి సిల్వర్ మెడల్ సాధించిందని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీఆర్‌ఆర్ వర్మ తెలిపారు. అండర్ 14–15 కేటగిరీలో శ్రావణి దేశం తరపున పాల్గొని ఈఘనత సాధించిందన్నారు. మెడల్ సాధించిన శ్రావణిని మంగళవారం పాఠశాలలో వర్మ, పీడీలు వరహాలమ్మ, శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తీరు దారుణం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలుగు వారికి అభ్యంతరాన్ని కలిగిస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 691వ రోజు మంగళవారం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ పాల్గొని, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి, బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయని, త్వరలోనే ప్రధానిని కలిసి అభ్యంతరం తెలుపుతామని చెప్పారు. ఈ నెల 30న నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనలో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కుటుంబాలతో కలిసి పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అగనంపూడి నిర్వాసిత కాలనీలో బుధవారం 24గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టి.ఎస్.ఎన్.పి.వెంకటేష్, జి.వి.ఎస్. రంగప్రసాద్, ఎం.ఏ. రాజు, టి.సురేష్, ఎం.వి. రమణ, పూర్ణచంద్రరావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీఐ రంగనాథం తెలిపారు. సబ్బవరం కేజీబీవీలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడా రు. వివిధ రకాల చట్టాలపై అవగాహన కోసం ప్రత్యేక వాహనం సిద్ధం చేసి డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం,గృహహింస,వరకట్న వేధింపులు,డ్రగ్స్,ర్యాగింగ్,చిన్నారులపై అఘాయిత్యాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల అక్రమ రవాణా,ప్రేమ పేరుతో వేధింపులు,తదితర అంశాలకు సంబంధించి నేరాలకు పాల్పడితే చట్ట ప్రకారం విధించే శిక్షల గురించి తెలియజేసేలా వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌వో మృదుల, మిగిలిన పోలీస్ సిబ్బందితో పాటు బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.1.3 లక్షలు మాయం

కూర్మన్నపాలెం: తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమవుతున్నాయని ఉక్కు ఉద్యోగి దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రాయి అప్పారావు గత నెల 29వ తేదీన కూర్మన్నపాలెం కూడలిలో ఉన్న మోర్ సూపర్ మార్కెట్ పక్కన గల ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేశారు. అప్పటి నుంచి అప్పారావు బ్యాంకు ఖాతా నుంచి దఫదఫాలుగా మొత్తం 1 లక్ష 30 వేల రూపాయలు మాయం అయ్యాయి. దీంతో ఆందోళన చెందిన బాధితుడు దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసే సమయంలో తన పక్కన ఓ మహిళ ఉందని, ఆమె తన ఏటీఎం కార్డును మాయం చేసి డబ్బులు తీసుకుంటున్నట్లు అనుమానం ఉందని అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. దువ్వాడ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భెల్ ఈడీని కలిసిన హెచ్‌బీఎస్ కమిటీ



ఈడీ జితేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఈడీ జితేందర్ రెడ్డిని బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ (హెచ్‌బీఎస్) 3వ ఫేజ్ విశ్రాంత ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ పరిపాలనా భవనంలో ఈడీ ఛాంబర్‌లో ఆయన్ను కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 3వ ఫేజ్ గృహ నిర్మాణం విషయంలో మేనేజ్‌మెంట్ సహాయ సహకారాలపై స్పందించాలని కోరారు. ఈడీని కలిసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రతినిధులు రామారావు, పి.శంకర్రావు, డి.పార్వతీశం, గొంది నవీన్ తదితరులున్నారు.

ఎడ్యుకేషనల్ టెక్నాలజీ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, సహాయ ఆచార్యుడు డాక్టర్ ఎం.వి. ఎస్.ఎస్.ప్రకాశరావు సంయుక్తంగా రచించిన «ఎడ్యుకేషనల్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ»పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం పుస్తక రచయితలను వీసీ అభినందించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా వర్తమాన అంశాలపై పుస్తక రచన చేయడంపై అభినందనలు తెలియజేశారు.